క్లుప్తంగా

ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తాం



ఫుట్‌పాత్ ఆక్రమించిన వారితో మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో దుకాణదారులు, భవనాల యజమానులు ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే పరిశీలించి తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు స్పష్టం చేశారు. కాశీబుగ్గ కేటీ రోడ్డులో ఉన్న దుకాణదారులతో మంగళవారం మాట్లాడి ఈ మేరకు హెచ్చరికలు చేశారు. పాదచారులకు ఉపయోగపడాల్సిన ఫుట్‌పాత్‌పై శాశ్వత నిర్మాణాలు చేపడితే వాటిని తొలగిస్తామని.. అటువంటి వారికి కొద్ది రోజులు గడువు ఇచ్చి అనంతరం కఠిన చర్యలు చేపడతామన్నారు.

భూ సమస్యలను పరిష్కరించుకోండి



వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

కంచిలి: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి సూచించారు. అంపురం పంచాయతీ పరిధి నరసన్నముకుందాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని రైతుల నుంచి వినతులను స్వీకరించారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మండల సర్వేయర్ చలపతిరావు ఉన్నారు.

మందస మండల కార్యదర్శుల సంఘ కార్యవర్గం

కాశీబుగ్గ: మందస మండలంలోని పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గం మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా నెయ్యిల మోహనరావు, ప్రధాన కార్యదర్శిగా పోతనపల్లి కల్పన, కోశాధికారిగా బలగ అరుణ, కొవ్వూరు సహజ, ఉపాధ్యక్షులుగా కూర్మారావు, నవీన్‌కుమార్, జీవన్‌కుమార్, ప్రధాన సలహాదారులుగా కుప్పిలి జయప్రకాష్, పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ జాబితాను ఎంపీడీవో పైల సూర్యనారాయణకు అందజేశారు.

నీటి సంఘాల డీసీ అధ్యక్షుడిగా బాలకృష్ణ

టెక్కలి: టెక్కలి డివిజన్ పరిధిలో నీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షునిగా మల్లా బాలకృష్ణను ఎన్నుకున్నారు. మంగళవారం టెక్కలి వంశధార ప్రాజెక్టు కమిటీ కార్యాలయంలో కార్య నిర్వాహణాధికారి శేఖర్‌బాబు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షునిగా సుగ్గు పోతయ్య రెడ్డి ఎన్నికయ్యారు. మొత్తం తొమ్మిది నీటి సంఘాల పరిధిలో డీసీ ఎన్నిక జరిగింది. ఇదిలా ఉండగా మల్లా బాలకృష్ణ గత టీడీపీ హయాంలో వంశధార ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు.

సచివాలయం సందర్శన



డి.జి.పురంలో ఆధార్ సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీవో తిరుమలరావు

కంచిలి: పోలేరు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో వి.తిరుమలరావు మంగళవారం సందర్శించారు. సమయపాలన పాటించాలని, పౌరసేవలు సకాలంలో అందించాలని సిబ్బందికి సూచించారు. ఉద్యోగుల పని తీరు, అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ చేపడుతున్న యాక్టివిటీస్‌పైన సమీక్షించారు. అలాగే డి.జి.పురం సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ డ్రైవ్ ప్రక్రియను పరిశీలించారు.

అనుకూలమైన పంటలు వేయాలి

ఇచ్ఛాపురం రూరల్: రైతులు రబీ కాలానికి అనుకూలమైన పంటలు వేసుకోవాలని వ్యవసాయ ఉప సంచాలకులు కె.జగన్మోహనరావు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం బిర్లంగి తోటూరులో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, రబీ పంట బీమా పద్ధతులు, ధాన్యం కొనుగోలు విధివిధానాలపై అవగాహన కల్పించారు. గురువారం, శుక్రవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంట కోస్తే వాటిని కుప్పలు వేయాలని, నూర్చు ధాన్యం ఉంటే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి టి.భార్గవి, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఏఎంసీలో చోరీకి యత్నం

టెక్కలి: కోటబొమ్మాళి మార్కెటింగ్ కమిటీ యార్డులోని సివిల్ సప్లై విభాగంలో చోరీకి విఫలయత్నం జరిగింది. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టే ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు.

పారని నీరు–తీరని ఆశ!



అర్ధాంతరంగా నిలిచిన గంగా సాగరం ప్రాజెక్టు

- అసంపూర్తిగా గంగా సాగరం రిజర్వాయర్ నిర్మాణం
- 20 ఏళ్లుగా పూర్తికాని వైనం
- వెయ్యి ఎకరాల ఆయకట్టుకు తీరని సాగునీటి కష్టాలు

కంచిలి: రెండు దశాబ్దాలైన రైతన్న ఆశలు నెరవేరలేదు. పాలకుల నిర్లక్షమే ఈ పరిస్థితికి కారణంగా విమర్శలు వస్తున్నాయి. అన్నదాతను ప్రోత్సహిస్తామని, గౌరవిస్తామనేవి కేవలం ప్రభుత్వ పెద్దల ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి తప్పా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదనేది స్పష్టం అవుతోంది. ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలోని రెండు మండలాల రైతాంగానికి సాగునీటి కష్టాలు తీర్చేందుకు మంజూరైన గంగా సాగరం రిజర్వాయర్ నిర్మాణం రెండు దశాబ్దాలు దాటినా పూర్తికాలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కంచిలి, సోంపేట మండలాల పరిధిలో వెయ్యి ఎకరాల ఆయకట్టులో రెండు పంటలు సాగు చేసుకునేలా 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కంచిలి మండల పరిధి జలంత్రకోట గ్రామం వద్ద ఉన్న గంగా సాగరం చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలని అప్పటి ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా ద్వారా ఆయకట్టు రైతులు కోరారు. దీంతో అప్పట్లో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 6.5 కోట్లు నిధులు మంజూరు చేశారు. అక్కడి నుంచి ప్రాజెక్టు నిర్మాణానికి వంద ఎకరాల భూమిని సేకరించారు. ఇందులో 60 ఎకరాలు చెరువు గర్భం కాగా మిగతా 40 ఎకరాలు రైతుల నుంచి సేకరించే ప్రక్రియను చేపట్టారు. అప్పట్లో ఆ ప్రక్రియ ఆలస్యం కావడంతో ప్రాజెక్టు నిర్మాణం కూడా మెల్లగా సాగింది. తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులకు అదనపు నిధులు మంజూరు చేస్తూ జీవో విడుదల చేశారు. ఈ చెరువు నుంచి రెండు కాల్వల ద్వారా ఆయకట్టు పొలాలకు సాగునీరు విడుదల చేయాల్సి ఉండగా.. వాటికి అనుగుణంగా రెండు పెద్ద స్లూయిస్‌లు,



ఇసుక మేటలు వేసిన సాగర గర్భం

చెరువు గట్టును నిర్మించారు. ఆ తరువాత ఏళ్ల తరబడి పనులు మెల్లగా సాగాయి. సుమారు రూ. మూడు కోట్లు విలువైన పనులు జరిగి.. ఆ తరువాత నిధులు లేమి కారణంగా ఆగిపోయాయి. అక్కడి నుంచి ప్రతి ప్రభుత్వంలోను రైతులు ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసి, తమకు నీరందించాలని కోరుకోవడమే మిగిలింది తప్పా పనులు పూర్తికాలేదు. ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే రెండు మండలాల పరిధిలో ఆరు పంచాయతీల్లో వెయ్యి ఎకరాల పంట పొలాలకు పుష్కలంగా సాగు నీరందుతుందని భావిస్తున్నా.. ఇంతవరకు తమ కోరిక నెరవేరడం లేదని ఆయకట్టు రైతులు చెబుతున్నారు. సాగునీరు పారక..తమ ఆశ నెరవేరలేదని అన్నదాత విచారం చేస్తున్నారు.



పిచ్చిమొక్కలతో నిండిన గట్టు

తీరని సాగునీటి కష్టాలు



గంగా సాగరం మినీ రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్మాణం రెండు దశాబ్దాలుగా పూర్తికాలేదు. ఇప్పటి వరకు దీని నిర్మాణానికి సుమారు రూ. 8.50 కోట్లు వరకు పలు దఫాలుగా నిధులు మంజూరు చేశారు. సుమారు రూ. 3 కోట్లు విలువైన పనులు జరిగాయి. తర్వాత కాలంలో పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఫలితంగా ఆయకట్టు రైతులకు సాగునీటి కష్టాలు తీరడం లేదు.

– యారడి ఆనందరావు, ఆయకట్టు రైతు, సర్పంచ్, గోకర్ణపురం, కంచిలి మండలం

చిత్తశుద్ధితో పనులు పూర్తిచేయాలి



గంగాసాగరం ప్రాజెక్టు నిర్మాణ పనుల్ని ఆయకట్టు ప్రాంత రైతుల అవసరాలను గుర్తించి, చిత్తశుద్ధితో పూర్తిచేయాలి. దశాబ్దాలుగా నిర్మాణ పనులు పూర్తిచేయకపోవడం దారుణం. ప్రాజెక్టు పనులు పూర్తికాకపోవడంతో నీరు పూర్తిస్థాయిలో నిల్వ ఉండటం లేదు. దీని వలన ఆయకట్టు రైతులు వర్షాలపైనే ఆధారపడాల్సిన దుస్థితి. ఈ పనులు పూర్తయితే ఆయకట్టు కింద పంట పొలాల్లో ఏడాదికి రెండు పంటలు సాగుచేసుకుందామని రైతులు ఎదురు చూస్తున్నారు. –పిరియా విజయ, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త

రైతుల గుండెల్లో వాయు‘గండం’!



సోంపేట: పూర్తిగా పండిన వరి పంట



వజ్రపుకొత్తూరు: పూండి ప్రాంతంలో వరి ఓవులను రక్షించుకునే పనిలో రైతులు



ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు ప్రాంతంలో వరి కుప్పలు వేస్తున్న రైతులు

సోంపేట/వజ్రపుకొత్తూరు రూరల్/వజ్రపుకొత్తూరు/ఇచ్ఛాపురం రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రెండు రోజుల్లో వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ హెచ్చరికతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం ఆకాశం మేఘావృతమై చిన్నపాటి చినుకులు పడడంతో రైతులు హడలిపోయారు. ఇప్పటికే కోత కోసిన వరిపంటను కుప్పలుగా వేయడం, ట్రాక్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో బిజీ అయ్యారు. ఏమాత్రం పెద్ద వర్షం పడినా పంటను కోల్పోతామని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయశాఖాధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులను అప్రమత్తం చేస్తున్నారు.

విశ్రాంత ఉద్యోగుల సేవలు సమాజానికి అవసరం

- జెడ్పీ చైర్‌పర్సన్ విజయ



సోంపేట: మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

సోంపేట: విశ్రాంత ఉద్యోగుల సేవలు సమాజానికి అవసరమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ప్రస్తుత సమాజానికి విశ్రాంత ఉద్యోగులు దిశానిర్దేశకులని వ్యాఖ్యానించారు. సోంపేట పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో జాతీయ పెన్షనర్స్ డే ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులు సమాజానికి వెలకట్టలేని ఆస్తి అన్నారు. నేటి సమాజంలో యువత సత్ప్రవర్తన కొనసాగించడానికి మార్గనిర్దేశకులుగా ఉండాలన్నారు. విశ్రాంత ఉద్యోగులు వారి ఆరోగ్యాలను కాపాడుకుంటూ సమాజ హితానికి కృషి చేయాలన్నారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పండి కృష్ణారావు, సంఘ ప్రతినిధులు కల్యాణ్ చక్రవర్తి, తోనంగి జోగారావు, రఘునాథ పాడి, దేవేంద్ర పండా, మూల వీరన్న పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సేవలు అనుభవ పాఠాలు



కవిటి: కామ్రేడ్ డీఎస్ నకారా విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కవిటి: రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో వివిధ హోదాల్లో దశాబ్దాల పాటు సేవలందించిన విశ్రాంత ఉద్యోగుల సేవలు ప్రస్తుత తరానికి అనుభవ పాఠాలుగా నిలుస్తాయని ఆ శాఖ గౌరవ అధ్యక్షుడు గొండ్యాల జానకీరామయ్య అన్నారు. కవిటిలో ఇచ్ఛాపురం సబ్ ట్రెజరీ పరిధి కవిటి మండలశాఖ ఆధ్వర్యంలో పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా పతాకావిష్కరణ చేశారుఅనంతరం నకారాతీర్పుతో లక్షలాదిమంది పెన్షనర్ల జీవితాల్లో వెలుగులు నింపిన కామ్రేడ్ డీఎస్ నకారా విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. రిటైర్డు ఉపాధ్యాయులు శమళ్ల రమణమూర్తి, కె.లోకనాథం, బార్ల ధనంజయలను సంఘం సభ్యులు దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికల్ని అందజేశారు. సోంపేట మండల వ్యవసాయ అధికారి బొర్ర నరసింహమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తాం



టెక్కలి: పెన్షనర్లను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

టెక్కలి: పెన్షనర్ల ఆర్థిక పరమైన సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని టెక్కలిసబ్ ట్రెజరీ అధికారి వి.రామకృష్ణారావు, ఎం.భాగ్యలక్ష్మి, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఎం.రవికుమార్ అన్నారు. టెక్కలి లోనివిశ్రాంత ఉద్యోగుల సమావేశ మందిరంలో పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. పెన్షన్ పితామహుడు నకారా సేవలను కొనియాడారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. సంఘం ప్రతినిధులు కె.ధనుంజయ్‌రావు, బి.అయ్యబాబు, జి.వి.రెడ్డి మాస్టార్, ఆర్.రామచంద్రరావు, ఆర్.పున్నయ్య, ఎం.లక్ష్మీనారాయణ, కె.కామేశ్వరరావు, ఎం.తాతయ్య, హెచ్.నాగేశ్వరరావు, ఎ.చిట్టెన్న, డి.ఎ.స్టాలిన్, నాగభూషణరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని సంఘ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షన్ పితామహుడు పి.ఎస్.నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్టీవో ప్రసాదరావు, పాఠశాల హెచ్‌ఎం విశ్వనాథం, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మోహన్‌రావు, ప్రతినిధులు వి.కేశవరావు, సభ్యులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: పాల్గొన్న విశ్రాంత ఉద్యోగుల సంఘ ప్రతినిధులు

ఎమ్మెల్సీ దువ్వాడ పరామర్శ

టెక్కలి: టెక్కలి మండలం పాతనౌపడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త దల్లి లోకేష్ రెడ్డి తల్లి మంగళవారం మృతి చెందారు. దీంతో ఆమె అంత్యక్రియల్లో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం లోకేష్‌రెడ్డిని పరామర్శించారు. ఎంపీటీసీ సభ్యుడు ఎస్.అప్పలరెడ్డి, కార్యకర్తలు జె.యోగేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

మహిళల రక్షణపై అవగాహన

ఇచ్ఛాపురం: స్థానిక కస్పాజాలరీ వీధిలో మహిళల రక్షణపై పట్టణ ఎస్సై ఇ.చిన్నంనాయుడు మంగళవారం అవగాహన కల్పించారు. మహిళాసంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తుండాలని సూచించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కవిటి: రాజపురం పంచాయతీ ఆర్.తోటూరులో మండల పరిషత్ నిధులు రూ. 1.80 లక్షలతో ఏర్పాటు చేయనున్న విద్యుత్ మోటార్‌బోరు, కుళాయి నిర్మాణ పనులకు ఎంపీటీసీ సభ్యుడు సనపల కృష్ణారావు మంగళవారం భూమి పూజ చేశారు. సర్పంచ్ సనపల జానకీరావు, నాయకులు బెందాళం డిల్లిబాబు, సనపల ఈశ్వరరావు, లొట్టి సోమేశ్వరరావు, గోరుసు దేవరాజు, మరిడి మోహనరావు, చింతల కోటేశ్వరరావు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

- డీఐజీ గోపీనాథ్ జెట్టి



కోటబొమ్మాళి పోలీస్ స్టేషన్ ఆవరణలో మహిళా పోలీసులతో మాట్లాడుతున్న డీఐజీ గోపినాథ్ జెట్టి

టెక్కలి: సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి సూచించారు. టెక్కలి డీఎస్పీ కార్యాలయం, కోటబొమ్మాళి పోలీస్ స్టేషన్‌లలో మంగళవారం వార్షిక తనిఖీలు చేపట్టిన అనంతరం మహిళా పోలీసులతో మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. డీఎస్పీ కార్యాలయం పరిధిలో వివిధ రకాల నేరాలు, కట్టడి చర్యలపై ఆరా తీశారు. ప్రతీ పెండింగ్ కేసును త్వరితగతిన దర్యాప్తు చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అప్రమత్తం చేయాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రయోజనాలపై సంకల్పం ద్వారా మరింత అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలీసులు డిజిటల్ ప్రక్రియ ద్వారా అరెస్టులు, విచారణలు చేయరనే విషయాన్ని ప్రజల్లో చైతన్య కల్పించాలన్నారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణం కల్పించే విధంగా వారితో మమేకం కావాలన్నారు. కోటబొమ్మాళి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్‌ఎన్ మూర్తి, సీఐలు ఎ.విజయ్‌కుమార్, కె.శ్రీనివాస్, ఎస్సైలు ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: ప్రజా సమస్యలను మున్సిపల్ అధికారులెవరూ పట్టించుకోరా అని ఒకటోవార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్ అధికారులను నిలదీశారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. 15వ ఆర్థికసంఘం నిధుల నుంచి టైడ్ గ్రాంట్ కింద విడుదలైన 82,84,638 రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు సంబంధించిన మూడు అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రోడ్లపై పశువుల సంచారం నివారణలో మున్సిపల్ అధికారులు ప్రకటనలకే పరిమితమవుతున్నారని, ముందస్తుగా పశువులు యజమానులకు అవగాహన కల్పించాలని వైస్ చైర్‌పర్సన్ లాబాల స్వర్ణమణి, తొమ్మిదో వార్డు కౌన్సిలర్ బి.జగన్ అధికారులను కోరారు. చైర్‌పర్సన్ రాజలక్ష్మి మాట్లాడుతూ.. సంతపేట వద్ద మున్సిపల్ స్థలంలో ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు టెండర్ ప్రక్రియలో ఉన్నట్లు తెలిపారు. నిర్మాణం పూర్తైతే రోడ్లపై సంచరించే పశువుల నివారణను సాధ్యమవుతుందన్నారు.

సరుకులు వితరణ



టెక్కలికి చెందిన అభయం యువజన సేవా సంఘం వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నిరుపేదలకు ఒక్కొక్కరికీ 25 కిలోల బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు అందజేశారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించి సభ్యులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డి.శ్రీనివాస్, కార్యదర్శి ఎల్.కామేశ్వరరావు, సభ్యులు ఎస్.సింహాచలం, డి.పూర్ణాచారి, ఎ.వీరభద్రం, జె.సుబ్బారావు, ఎం.లక్ష్మీనారాయణ ఉన్నారు. – టెక్కలి

దుప్పట్లు అందజేత..



సంతబొమ్మాళి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులకు కానూరి ఆనందరావు మాస్టర్ సొంత డబ్బులతో దుప్పట్లను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో చిన్నవాడు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని కోరారు. అనంతరం ఎంఈవో మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం ఎ.రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – సంతబొమ్మాళి

విద్యార్థులకు నగదు బహుమతులు..



పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ఎనిమిది మందికి నగదు బహుమతులతో మంగళవారం సత్కరించారు. వీరు చదువులో బాగా రాణిస్తున్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి వెయ్యి రూపాయలు, ద్వితీయ స్థానంలో ఉన్న వారికి రూ. ఎనిమిది వందలు, ప్రశంసా పత్రాలను ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి అందజేశారు. ప్రముఖ వ్యాపారవేత్త తంగుడు భీమారావు బహుమతులను అందించి విద్యార్థులను అభినందించారు. – కాశీబుగ్గ

సైబర్ నేరాలపై అవగాహన..



సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టెక్కలి సీఐ విజయ్ కుమార్ అన్నారు. సోమవారం రాత్రి టెక్కలి మండలంలోని ఆంజనేయపురంలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలకు గురికాకుండా ఎలా అప్రమత్తంగా ఉండాలో సీఐ అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ చెప్పమంటే ఎవరూ స్పందించవద్దన్నారు. పిల్లలు చెడు వ్యసనాలకు గురికాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. – టెక్కలి రూరల్

36 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు

కంచిలి: మండలంలోని పద్మతుల గ్రామ కూడలి వద్ద 36 లీటర్ల నాటుసారా ప్యాకెట్లతో ఇద్దరు వ్యక్తులను సోంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.బేబి మంగళవారం అరెస్టు చేశారు. ఒడిశా మున్సిపేటకు చెందిన కె.మోహనరావు, కంచిలి పంచాయతీ పరిధి బీపీ కాలనీకి చెందిన సాహుకారి మహేష్‌లు రెండు ప్లాస్టిక్ సంచుల్లో సారా ప్యాకెట్లను తీసుకొని కవిటి మండలం పరిధిలో గ్రామాలకు రవాణా చేస్తుండగా పట్టుబడ్డారు. సారాను స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు.

ముగిసిన శిక్షణ

కంచిలి: లోకలైజేషన్ సస్టెయినబుల్ డెవెలప్‌మెంట్ గోల్ (ఎల్ఎస్‌డీజీ)పై స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు రెండ్రోజులుగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. పంచాయతీ కార్యదర్శులు ఎ.తులసయ్య, వై.విశ్వనాథం ఎంవోటీలుగా వ్యవహరించి ఎల్ఎస్‌డీజీపై పీపీటీ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో వి.తిరుమలరావు, ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ పాల్గొన్నారు.